ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
7★★★
గురువారం 16 అక్టోబరు 2025



వెక్కిరిస్తున్న ఖాళీలు..



- జిల్లాలోని అంగన్‌వాడీల్లో 234 పోస్టులు ఖాళీ..
- పోస్టుల భర్తీ కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అంగన్‌వాడీ ఖాళీలభర్తీ ఊరిస్తూ వెక్కిరిస్తున్నాయి. తరచూ భర్తీపై ప్రభుత్వఆశలు కల్పిస్తున్న నోటిఫికేషన్ మాత్రం రావడం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగా నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి ఇచ్చిన హామీ కూడా ఆచరణలోకి రాలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 586 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా టీచర్లు, ఆయాల ఖాళీలు 234కు చేరాయి. టీచర్లు, ఆయాలకు పదవీ విరమణ బెనిఫిట్స్ రావడంతో ప్రతినెలా 10నుంచి 15 మంది వరకు పదవీ విరమణ పొందుతున్నారు. దీంతో టీచర్ పోస్టు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యత పక్కనే ఉన్న కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో అదనపు భారం మోయాల్సి వస్తోంది. దీనికి తోడు ప్రభుత్వం ఇటీవల వివిధ యాప్‌ల ద్వారా ఫొటో క్యాప్చర్ విధానం తీసుకురావడంతో కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు నిరుద్యోగ మహిళలు అంగన్‌వాడీ ఖాళీల భర్తీ నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్నారు.

జిల్లాలో 55 టీచర్లు, 179 ఆయాల ఖాళీలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 586 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 20 మినీకేంద్రాలు ఉండగా వాటిని పూర్తిస్థాయి కేంద్రాలుగా మార్చారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో రిటైర్‌మెంట్ పక్రియను అమల్లోకి తేవడంతో ఒకేసారి జిల్లాలో 122పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రతినెలా ఖాళీలు పెరుగుతున్నాయి. గతంలో ఉన్న ఖాళీలతో కలుపుకోని జిల్లాలో 234 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో 55 టీచర్లు, 179ఆయాలు ఖాళీగా ఉన్నాయి. సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో362 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా 41 టీచర్‌పోస్టులు, 109అయాలు, వేములవాడ ప్రాజెక్ట్ పరిధిలో 224 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా 14 టీచర్ పోస్టులు, 70 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెద్ద మొత్తంలో పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే నిరుద్యోగ మహిళలకు ఊరటనిస్తుందని భావిస్తున్నారు.

ఈసారి ఇంటర్ అర్హత..

అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీకి సంబంధించి గతంలో విద్యార్హతల్లో టీచర్లకు పదవతరగతి, ఆయాలకు 7వ తరగతి అర్హతగా ఉంది. ప్రీ స్కూల్‌గా మార్చి అంగన్‌వాడీ కేంద్రాలద్వారా చిన్నారులకు పూర్వవిద్యను అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈసారి టీచర్లు, ఆయాలకు ఇంటర్మీడీయట్ అర్హతగా నిర్ణయించారు. టీచర్లు, ఆయాలకు వయస్సు 18నుంచి 35 ఏళ్లగా నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా సంక్షేమశాఖ అంగన్‌వాడీ పోస్టులభర్తీకి సంబంధించిన.. - మిగతా 10లో

రేషన్ బియ్యం పంపిణీలో చేతివాటం

- డీలర్‌తో లబ్ధిదారుల వాగ్వాదం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో డీలర్ చేతివాటం ప్రదర్శించాడు. తక్కువ బియ్యం రావడంతో ఇదేమిటనీ లబ్ధిదారులు డీలర్‌తో వాగ్వాదానికి దిగిన సంఘటన వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండాలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామంలోని డీలర్ బియ్యం పంపిణీ చేపట్టారు. ఓ లబ్ధిదారుడికి 18 కిలోలు, మరో లబ్ధిదారుడికి 12కిలోలు అందించాడు. ఇంటికి చేరుకున్న వారు అనుమానం వచ్చి తూకం వేయడంతో 18 కిలోలకు 15 కిలోలు, 12 కిలోలకు 10.5 కిలోలు వచ్చాయి. బియ్యంతో డీలర్ వద్దకు చేరుకుని నిలదీశారు. తప్పుకునే ప్రయత్నం చేయడం వల్ల వాగ్వాదానికి దిగారు. తూకంలో చేతివాటం ప్రదర్శిస్తున్న సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని లబ్ధిదారులు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చందుర్తి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి ఆదర్శ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఆటో యూనియన్ నాయకులు రూ.5116 విరాళం గౌడ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బత్తుల కమలాకర్, మర్రి భూమేష్, కత్తి పరశురాములు, సిరికొండ కనకయ్య, పురుగుల లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులు టీ సహస్రిత(9వ తరగతి), బీ ఆశ్రితరెడ్డి(8వ తరగతి)లను కరస్పాండెంట్ పల్లె రాజిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరువులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు సహస్రిత, ఆశ్రితరెడ్డిలు పాల్గొంటారన్నారు. ప్రతిరోజు కృషి, పట్టుదలతో సాధన చేశారు. అండర్-14 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో సత్తాచాటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నవీన్, బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార శాఖ రిజిస్ట్రార్‌ను కలిసిన కొండూరు



సురేంద్రమోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్‌గా బాధ్యతలు చేపట్టిన కె సురేంద్ర మోహన్‌ను బుధవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు హైదరాబాద్‌లో కలిశారు. సురేంద్రమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కొండూరు పుష్ప గుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన సహకార సంఘాల పాలక మండళ్లను పూర్తి స్థాయిలో నియామకం చేపట్టి ఉత్తర్వులు జారీ చేయాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం అడిషనల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ జి చంద్రమోహన్‌రెడ్డిని కూడా కొండూరు రవీందర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు.

ధాన్యం డబ్బులు త్వరగా జమ అయ్యేలా చూడాలి

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి - వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల నుంచి 72 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేయడానికి వీలుగా కలెక్టర్ శ్రద్ధ చూపాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులతో ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం దిగుబడిలో తెలంగాణ రాష్ట్ర ఆల్‌టైం రికార్డులను సృష్టించిందన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు ఇబ్బందులకు లేకుండా కొనుగోలు చేపట్టడంతోపాటు మౌలిక వసతులను కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు పూర్తిస్థాయిలో రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 48గంటల నుంచి 72 గంటలల్లో చెల్లింపులు చేపట్టాలన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్‌లను అందిస్తామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా చర్యలు చేపట్టడంతో పాటు కొనుగోలుకు సంబంధించిన అన్ని పరికరాలను అమర్చుకోవాలన్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. వాతావరణం మార్పులు, వర్ష సూచనలను పౌరసరఫరాల అధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్ కవర్లను ఏర్పాటు చేసుకుని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకొని రావాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురైతే 1800 425 00333/1967 హెల్ప్‌లైన్ నంబర్‌లకు ఫోన్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసేవరకు జిల్లా కేంద్రం నుంచి కొనుగోలు కేంద్రాల వరకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీఎస్‌వో చంద్రప్రకాష్, డీఎం రజిత, డీఏవో అఫ్జల్‌బేగం, డీసీవో రామకృష్ణ, మోప్మా ఏవో మీర్జాఫసహత్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు దూది శ్రీనివాసరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన తాటికొండ ఉమాకు రూ.39500, మల్యాల రాజేశంకు రూ. 20 వేల చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు ధర్మపురి శ్రీనివాస్, ఇందూరు మధు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రవ్యాపార సంఘ అధ్యక్షుడిగా ప్రభాకర్

ఇల్లంతకుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో వస్త్ర వ్యాపార సంఘ సమావేశంలో నూతన అధ్యక్షుడుగా చేరాల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నార్ల అనీల్‌కుమార్, కోశాధికారిగా కీర్తి విజయ్, సలహాదారులుగా బొల్లి మార్కండేయులు, కొమిరె గోపి, కార్యవర్గ సభ్యులుగా నటరాజ్, దశరథం, విజయ్, భాస్కర్, రామచంద్రం, హరీష్, రాహుల్, శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

విభేదాలకు తావులేకుండా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక

- ఏఐసీసీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అబ్జర్వర్ మన్నే శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో విభేదాలకు తావులేకుండా నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిని ఎంపిక చేస్తామని ఏఐసీసీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అబ్జర్వర్ మన్నే శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రగుడు మల్లికార్జున కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అబ్జర్వర్ మన్నే శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి ఎంపికపై వారి అభిప్రాయాలు, సూచనలు సానుకూలంగా విన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన భారత్ జోడో యాత్ర విజయవంతం అయిందని, ప్రజలు స్వాగతించారని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలలో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ దేశ వ్యాప్తంగా ఏఐసీసీ స్థాయిలో జరుగుతున్న పరిణామాలను క్షుణంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల ఎన్నిక పారదర్శకంగా నిర్వహించడానికి ఏఐసీసీ అబ్జర్వర్లను నియమించి బాధ్యతలను అప్పగించారన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపిక పారదర్శకంగా ఉంటుందని నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎంపిక ఉంటుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తతో ముఖాముఖి మాట్లాడి వారి నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తామన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ ముఖ్య ఉద్దేశం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా బలపరచడమేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే సమన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, విబేదాలకు తావు లేకుండా ప్రతి ఒక కార్యకర్త, నాయకుల సలహాలు, సూచనలు అభిప్రాయాలను తీసుకున్నాకే జిల్లా అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందన్నారు. జిల్లాలో బ్లాక్ లెవల్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ వారి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు జిల్లాలోని ప్రతి నాయకుడు, కార్యకర్తలు తమకు సహకరించాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో మమేకమై జిల్లా అధ్యక్షుడి పదవికి అర్హులైన వారిలో ఎవరైతే బాగుంటుందనే సూచనలను తీసుకొని ఏఐసీసీకి నివేదిక ఇవ్వడానికి శ్రీనివాస్ అబ్జర్వర్‌గా వచ్చారన్నారు. ఏఐసీసీ ప్రస్తుతం తెలంగాణలోని అన్ని జిల్లాలకు అబ్జర్వర్‌లను పంపించారన్నారు. కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లే క్రమంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గం స్థాయిలో సమావేశాలను ముఖాముఖి చర్చలను నిర్వహిస్తారన్నారు. ఈనెల 17 వరకు జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం చేసిన దరఖాస్తులను స్వీకరించి అదే రోజు కాంగ్రెస్ శ్రేణులతో శ్రీనివాస్ సమావేశం నిర్వహిస్తారని అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సూచనలకు సంబంధించిన నివేదికను ఏఐసీసీకి పంపిస్తారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ చక్రధర్‌రెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా..

- దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్



సమీక్ష సమావేశంలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్, శైలజరామయ్యార్ 9

రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్ 10

సీపీఆర్‌పై ఉద్యోగులకు అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ నగేష్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు సీపీఆర్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సీపీఆర్ చేసి చూపించగా, ప్రభుత్వ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జున అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందరికి సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్డియాక్ అరెస్టు అయిన వారి వివరాలు 108అంబులెన్స్‌కు సమాచారమిస్తూ వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, బాలికలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని డీడబ్ల్యువో లక్ష్మీరాజం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం సుభాష్‌నగర్ పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీడబ్ల్యువో లక్ష్మీరాజం పాల్గొని పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే నినాదంతో ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్, షుగర్ వాడకాన్ని తగ్గించి మంచి పోషకాహారాలైన పాలు, గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. శిశువు ఎదుగుదలలో మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దివ్య, డీసీపీవో కవిత, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు మిగిలింది మూడు రోజులే..

- 19 రోజుల్లో 435 దరఖాస్తులు దాఖలు

- ఫీజు రూపంలో రూ.13.05కోట్ల ఆదాయం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్స్ టెండర్ల దాఖలుకు మూడు రోజులే మిగిలాయి. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మూడు కౌంటర్‌లలో 48వైన్స్‌లకు టెండర్‌ల ప్రక్రియ గతనెల 26న ప్రారంభమైనప్పటికీ దరఖాస్తుల ప్రక్రియ కొంత మందకొడిగా సాగింది. గత 19రోజులుగా 48వైన్స్‌లలో 46 వైన్స్‌లకు దాదాపు 435 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. మరో 2 వైన్స్‌లకు ఒక్క దరఖాస్తు రాలేదు. ఇందులో బుధవారం మద్యం వ్యాపారులు 105 దరఖాస్తులు సమర్పించారు. ఇందులో మహిళలు 100మందికి పైగా దరఖాస్తుచేశారు. ఈ దరఖాస్తు ప్రక్రియ చివరికి చేరడంతో భారీగా దరఖాస్తులు దాఖలు అయ్యే అవకాశం ఉంది. వైన్స్‌లకు దరఖాస్తులు దాఖలు చేసేందుకు ఈనెల 18న చివరితేదీ కావడంతో మంచిరోజులు మూడు రోజులే కీలకం అయ్యాయి. మిగిలిన దశమి, ఏకాదశి, ద్వాదశి మంచిరోజుల్లోనే దరఖాస్తు చేసేందుకు మద్యంవ్యాపారులు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు దాఖలైన 435 దరఖాస్తుల ద్వారా రూ.13.05 కోట్ల ఆదాయం సమకూరింది. గత 2021-23 సంవత్సరంలో 944, 2023-25లో 2036 దరఖాస్తులు దాఖలయ్యాయి. చివరి మూడురోజుల్లో భారీగా దరఖాస్తులు చేసేందుకు మద్యం వ్యాపారులు సిద్ధమయ్యారు. జిల్లాలోని 48వైన్స్‌లలో సిరిసిల్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వైన్స్‌లకే విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రధానంగా పది వైన్స్‌లపైనే మద్యం వ్యాపారులు దృష్టి పెట్టారు. ఈ వైన్స్‌లకు విపరీతమైన పోటీ నెలకొంది.

ఎక్సైజ్ శాఖ విస్తృత ప్రచారం..

జిల్లాలో వైన్స్ టెండర్‌లకు ఎక్సైజ్ శాఖ విస్తృత ప్రచారం నిర్వహించింది. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో ఉన్న వైన్స్‌లకు గతంలో వేసిన దరఖాస్తుదారులందరికి మెస్సెజ్‌లు పంపించారు. మరోవైపు ఫ్లెక్సీ ద్వారా విస్తృత ప్రచారం చేశారు. సర్కిల్ వారీగా టార్గెట్ పెట్టారు. దీంతో మద్యం వ్యాపారులకు ప్రతి రోజు ఫోన్‌లు చేసి దరఖాస్తు చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిడి ఏమేరకు ఫలిస్తుందో మూడు రోజులు వేచి చూడాల్సిందే. జిల్లాలో ఈసారి 1500 దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● గర్షకుర్తి విష ప్రయోగం ఘటనలో ఇప్పటికే భర్త మృతి


లక్ష్మి (ఫైల్)

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో వృద్ధ దంపతులపై విష ప్రయోగంలో ఇప్పటికే భర్త మృతి చెంద గా భార్య తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. గర్షకుర్తిలో ఈ నెల 7న గజ్జల శంకరయ్య అతని భార్య లక్ష్మీలకు అదే గ్రామానికి చెందిన కత్తి శివ మత్తు గుళికలు ఇవ్వ డంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుం డగా శంకరయ్యకు పరిస్థితి విషమించి ఈనెల 8న మృతిచెందాడు. అప్పటి నుం చి కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీ బుధవారం తుది శ్వాస విడిచింది. వృద్ధ దంపతులపై విషప్రయోగం జిల్లా లో కలకలం రేపింది. గంగాధర ఎస్సై కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడు కత్తి శివను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నగదు, బంగారం స్వా ధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం పెద్దపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే పట్టణానికి చెందిన వెలిచాల రమేష్(55) కూనారం రోడ్డులో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న నిచ్చెనను రెండో అంతస్తుకకు తీసుకెళ్తుండగా నిచ్చెన 11కేవీ వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో రమేష్ అక్కక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్ భార్య సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గోదావరిలో కొట్టుకొచ్చిన ఆర్మూర్ వాసి మృతదేహం

మల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన జోరిగే గంగాధర్(35) అనే వ్యక్తి మృతదేహం బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో గుర్తించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జోరిగే గంగాధర్ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా నష్టపోయిన గంగాధర్ అప్పు ఎక్కువడంతో ఈ నెల 8న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 10న సోన్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా భార్య మౌనిక మృతదేహం పరిశీలించి భర్త జోరిగే గంగాధర్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో యువకుడి అనుమానాస్పద మృతి

- స్వగ్రామానికి చేరిన మృతదేహం


తేజ (ఫైల్)

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పిట్ల తేజ(24) అనే యువకుడు ఇటీవల గల్ఫ్‌లో అనుమానాస్పదంగా మృతిచెందగా, బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉపాధి నిమిత్తం 8 నెలల క్రితం తేజ రూ.లక్షకు పైగా అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ పనిసరిగా లేక ఇబ్బందులు పడ్డ తేజ ఆగస్టు 29న ఇండియాకు వస్తున్నట్టు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. ఇండియాకు వచ్చే క్రమంలో అనుహ్యంగా దుబాయిలో తప్పిపోయి, మరుసటి రోజు రూంకు వచ్చాడు. తేజ ఒంటిపై గాయాలు ఉండటంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి తిరిగి సెప్టెంబరు 3న తన రూం వచ్చాడు. తెల్లారేసరికి తేజ మళ్లీ రూంలో కన్పించకపోవడం, సెప్టెంబరు 19న పోలీస్‌లకు శవమై కన్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తేజ మరణవార్త సెపెంబరు 23న వారి బంధువులకు తెలిసింది. 27 రోజులకు తేజ మృతదేహం స్వగ్రామమైన నాగంపేటకు వచ్చింది. మృతుడికి తల్లిదండ్రులు లత, రాజేష్, తమ్ముడు గౌతమ్ ఉన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య


శంకరయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు భరించలేక మనస్థాపం చెందిన వ్యవసాయ కూలీ చాట్ల శంకరయ్య(55) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని శంకరయ్య వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించినా ఆరోగ్యం కుదుట పడలేదు. మనస్థాపం చెందిన శంకరయ్య ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు నర్సింలు, సురేందర్, కూతురు శిరీష, తల్లి లక్ష్మి ఉన్నారు.

జాడ లేని చేప పిల్లలు



● సమయం మించిపోతున్నా పట్టించుకోని పాలకులు.. అధికారులు

● ఆలస్యమైతే ఎదగడం కష్టం...

ఇల్లందకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటును ఇచ్చేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల కోసం టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా చెస్తేనే చెరువులు నిండే వరకు చేపపిల్లల పంపిణీ సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

ఉసేలేని టెండర్లు...

గతంలో చేప పిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మే నెలలోనే జరిగేది. కాంట్రాక్టర్లు సీజన్ మొదలయ్యే లోపే చేప పిల్లలను మండలాలకు చేప పిల్లలు చేర్చి చెరువుల్లో వదిలేవారు. దీంతో చేప పిల్లల ఎదుగుదల బాగుండేది.

అదను దాటితే అంతే సంగతులు...

అదను దాటిన తర్వాత చేప పిల్లలను చెరువులో వదిలితే వాటి ఎదుగుదల సరిగా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు నెల చివరి లోపే చేప పిల్లల పెంపకాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. అప్పుడే చేప పిల్లల ఉత్పత్తి బాగుంటుంది. లేదంటే ఏ రకమైన చేప అయినా సరే బరువు అంతంతగా పెరుగుతుంది. ప్రభుత్వం చేప పిల్లలకు సంబంధించిన టెండర్లు నిర్వహించాలని మత్స్యకార సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఆలస్యమైతే ఎదగడం కష్టం..

యామ శ్రీనివాస్, మత్స్యకారుడు, టేకుర్తి



చేప పిల్లలను ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ చేస్తే వాటి ఎదుగుదల కష్టంగా ఉంటుంది. ప్రతి ఏటా చేపలను పట్టుకొని అమ్మడం వల్ల కొంత ఉపాధి దొరికేది. రెండేళ్లుగా చేప పిల్లల పంపిణీ లేక ఉపాధి కోల్పోతున్నాం. ఇప్పటికే సమయం దాటి పోయింది. ఈ నెలాఖరు వరకైనా పంపిణీ చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి

పుట్ట రాజు, మత్స్యకారుడు, వాగొడ్డురామన్నపల్లి



గ్రామాల్లోని చెరువుల్లోకి చేపల పిల్లల పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి చెరువుల్లో చేపలను పంపిణీ చేయాలి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్రియాల, తక్కళ్లపల్లి, బొమ్మెన పెద్దవాగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను బుధవారం రెవెన్యూ అధికా రులు పట్టుకున్నారు. ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతిలో' ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు.. అనుమతులకు అధికారుల నిరా కరణ అనే శీర్షికన ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. ఏకకా లంలో మూడు బృందాలు దాడులు చేసి అక్రమంగా వాగు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కరీంనగర్ రూరల్‌లో..

కరీంనగర్ క్రైం : కరీంనగర్ రూరల్ మండ లం వల్లంపహాడ్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కోరుట్ల రూరల్, 15 (ఆంధ్రజ్యోతి) పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ..కోరుట్ల రూరల్ మండలంలోని మాదాపూర్ శివారు, రామారావుపల్లె శివారులో వేర్వేరుగా రెండు గ్రూపులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా సీసీఎస్, కోరుట్ల పోలీసులు దాడులు చేసి వారిని పట్టుకున్నట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. మాదాపూర్ శివారులోని గ్రూపులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12150లు, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. రామారావు పల్లె శివారులో పేకాట ఆడుతున్న మరో గ్రూపు నుంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీకుకోగా వారి వద్ద నుంచి రూ, 5100లు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

25 నుంచి యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు సంఘం నగర కార్యదర్శి అల్లపు అభిలాష్ తెలిపారు. బుధవారం ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించ నున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యలపై చేపట్టనున్న కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, పీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మణి తేజ, అభిలాష్, ఉమామహేశ్వర్, రాకేష్, సాయి కుమార్ పాల్గొన్నారు.

కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దు

జమ్మికుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దని అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాల మైదానం విస్తీర్ణం 20ఎకరాలు ఉండేదని, ప్రస్తుతం 8 ఎకరాలకు వచ్చిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. అథ్లెటిక్స్ స్టేడియం వస్తే వాకింగ్ చేసేవారికి, ఆడుకునే పిల్లలకు భంగం కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. కబ్జాకు గురైన ఇండ్లను కూల్చేసి స్టేడియం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సాయిరాం, వెంకటేష్, సజ్జద్, రత్నాకర్, సుధీర్, రాజేష్, విష్ణు, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు చెల్లించడం లేదని ఇంటికి తాళం

- గర్జనపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన బాకీ డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న పాపానికి ఇంటిలో నుంచి కుటుంబ సభ్యులను బలవంతంగా బయటకు గెంటేసి తాళం వేసిన సంఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. అప్పు ఇచ్చిన వ్యక్తి తమను మానసికంగా వేధించడంతో పాటు ఇంటికి తాళం వేశారని పేర్కొంటూ బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని అబ్రహం అదే గ్రామానికి చెందిన నరేశ్ వద్ద రూ2.50 లక్షల అప్పు తీసుకున్నాడు. అందుకు అతని సోదరుడు బాబు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ప్రతినెలా వడ్డీ కింద అబ్రహం రూ.25 వేలు చెల్లించేవాడు. మూడు నెలల నుంచి డబ్బులు చెల్లించకపోవడంతో అబ్రహంను బాకీ ఇచ్చిన వ్యక్తి నరేశ్ అడిగాడు. పరిస్థితి బాగులేదని విన్నవించుకున్న ఆయన పట్టించుకోలేదు. మధ్యవర్తిగా ఉన్న బాబు ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ఇంటికి తాళం వేస్తానని తేల్చిచెప్పాడు. కొంత గడువు ఇస్తే బాకీ డబ్బులు ఇప్పించేలా చూస్తానని ప్రాధేయపడినా వినిపించుకోకుండా బాబు ఇంటికి నరేశ్ తాళంవేశాడు. దాంతో బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన రేణికుంట బాబు(34) అనే యువకుడు మోటారు సైకిల్‌పై మానకొండూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. గంగిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు సైకిల్‌పై కరీంనగర్ వెళ్తుండగా లలితాపూర్ బస్టాండ్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో బాబుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో ఒకరికి మూడు సంవత్సరాల జైలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో తల్లి, తమ్ముళ్లపై దాడి చేసిన కేసులో ఎర్ర అక్షయ్‌కుమార్ (21)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల దొంతాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కళావతి భర్త మృతి చెందిన తరువాత తన పెద్ద కొడుకు అక్షయ్‌కుమార్ డబ్బులు అడుగుతూ తరచుగా గొడవలు పెట్టాడు. తల్లి, తమ్ముళ్లపై దాడికి పాల్పడడంతో అతడి బాధలు భరించలేక కళావతి తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. 2020 అక్టోబరు 4న రాత్రి అక్షయ్‌కుమార్ తన స్నేహితులను తీసుకువచ్చి తల్లిని, తమ్ముళ్ల సంజయ్‌కుమార్, ఉదయ్ కుమార్‌లపై దాడి చేశాడు. కళావతి అన్న దాసరి కిషన్ అడ్డుగా వెళ్లగా అతడిపై కూడా దాడి చేశాడు. కొడుకు అక్షయ్‌కుమార్ వల్ల తనకు ప్రాణ భయం ఉందని బాధితురాలు కళావతి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు ఎర్ర అక్షయ్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి జైలు శిక్ష పడటంలో కృషి చేసిన అడిషనల్ పీపీ రాజేష్, ఇన్వెస్టిగేషన్ ఎస్ఐలు శ్రీకాంత్, కిరణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు పీసీ మహేష్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై దెబ్బతిన్న బారికేడ్లు


పై జంక్షన్ సమీపంలో పక్కన పడి ఉన్న బారికేడ్


దిగువ కొండగట్టు ఘాట్‌రోడ్డు ప్రారంభంలో దెబ్బతిన్న బారికేడ్

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బారికేడ్లపై నిర్లక్ష్యం అలుముకుంది. ఏడేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో సుమారు 67మంది మృతి చెందడంతో ప్రభుత్వం ఈ ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేసింది. తరువాత కొన్నాళ్లకు షరతులతో వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వగా భారీ వాహనాలను పూర్తిగా నిషేధించింది. ఇందులో భాగంగా దిగువ కొండగట్టు వద్ద ఘాట్‌రోడ్డు ప్రారంభంలో, ఘాట్‌రోడ్డు చివరలో కొండపై పైజంక్షన్ వద్ద రెండు భారీ వాహనాల రాకపోకలు ఉండకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొండపై పైజంక్షన్ వద్ద గల బారికేడు పూర్తిగా కూలిపోవడంతో పక్కన పడేశారు. కొండ కింది బారికేడు వాహనాలు ఢీకొని దెబ్బతిన్నది. భారీ వాహనాలు బారికేడు కింద నుంచి వెళ్లాలనే ప్రయత్నంలో బారికేడ్లు దెబ్బతిని ధ్వంసం అవుతుండగా పట్టించుకునే వారే లేకపోవడంతో భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ప్రమాదానికి ముందు ఏర్పాటు చేసినవి ఇలాగే పడిపోవడం, మళ్లీ ఏర్పాటు చేయకపోవడంతో బస్సు ప్రమాదంతో పాటు అనేక ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో భక్తులు మృత్యువాత పడ్డ సంఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు కూడా బారికేడు కూలిపోవడంతో అడ్డు కనిపించక బారీ వాహనాలు ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అయినవారు దూరమై అనాథగా బాలుడు

● మూడు రోజుల క్రితం తండ్రి, గతంలో తల్లి మృతి


స్వాద్విన్ కుమార్

చొప్పదండి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ స్వాద్విన్‌కుమార్ తల్లిదండ్రులు కోల్పోవడంతో అనాథగా మారాడు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న స్వాద్విన్ కుమార్ తండ్రి దీకొండ అశోక్ గత ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. మూడు సంవత్సరాల క్రితం తల్లి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మరణించింది. తల్లి మరణించిన తరువాత అన్ని తానై పెంచిన తండ్రి కూడా మరణించ డంతో స్వాద్విన్ కుమార్ ఒంటరిగా మిగిలాడు. తాత,నానమ్మలు కూడా గతంలో మరణించగా బాలుడి పరిస్థితి దిక్కులేని వాడు అయ్యాడని గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కన్నీటి పర్యంతం అవుతున్నాడు.

బీసీ సంఘాల బంద్‌ను విజయవంతం చేయాలి


బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ సంఘాల, కుల సంఘాల నాయకులతో బుధవారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, ఆది మల్లేశం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, నారోజు రాకేష్ చారి, కోడూరి పర్శరామ్ గౌడ్, నర్సింగోజు శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్, మాచర్ల అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ జయప్రదం చేయాలి

భగత్‌నగర్ : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన కోసం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టాన్ని అమోదించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పిన ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి సుల్తానాబాద్ వైపు వస్తున్న పట్టణంలోని మార్కండేయకాలనీకి చెందిన దేవోజు లక్ష్మినరసింహచారి(52) మండలంలోని కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

కల్వచర్లలో చోరీ.. పోలీసుల తనిఖీలు


కల్వచర్లలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

రామగిరి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలోని సౌమిత్రి లావణ్య పాతగృహంలో చోరీ జరిగింది. శివాలయం వెనకల గల పాత ఇంటిలో స్టోర్ చేసిన ఇత్తడి, రాగి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఉదయం పాత ఇంటిలోకి వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితురాలు పోలీస్‌లకు సమాచారం ఇవ్వగా ఎస్ఐలు శ్రీనివాస్, దివ్య ఆధ్వర్యంలో పోలీస్‌లు ఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.

●మార్కెట్‌లో జేబుదొంగతనం

మండలంలోని సెంటినరీకాలనీలోని సంతలో బుధవారం జేబుదొంగతనం చేస్తూ పట్టిబడిన ఇద్దరిని వ్యాపారస్తులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అగ్నిప్రమాదం

వేములవాడ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్(ఇన్‌కేబుల్) నెట్‌వర్క్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మెయిన్ బోర్డులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. షార్ట్‌సర్క్యూట్ ప్రభావంతో కార్యాలయంలోని దాదాపు రూ.2లక్షల విలువైన కంప్యూటర్లు, ఇతర కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ కేబుల్ నెట్‌వర్క్ సేవలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా వెంటనే యజమాని కొలిపాక నర్సయ్య ప్రత్యామాయ ఏర్పాటు చేశారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నష్టం అంచనా వేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ గ్రామానికి చెందిన రాజేష్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా గుర్తించిన పోలీసులు బుధవారం అతడికి అప్పగించారు. 2023 నవంబరు 22న బొమ్మకల్‌లో సెల్‌ఫోన్ పోగొటుకున్న రాజేష్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాజేష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అందజేశారు. ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటకు చెందిన లకిడి వీణరాణి ఇటీవల తన వివో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీస్‌లు వెంటనే ఐఎమ్ఈఐ నెంబర్ ద్వారా మొబైల్‌ను పట్టుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ నాగరాజు మహిళకు ఫోన్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నట్లు శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. బుధవారం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి కంపెనీలలో ఉద్యోగాలు రావడానికి అవకాశాలు కల్పిస్తారని, మూడు సంవత్సరాలు ఈ ఒప్పందం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలే అవగాహన ఒప్పందం లక్ష్యమన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, డాక్టర్ హరికాంత్ పాల్గొన్నారు.

'రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు'..



శంకరపట్నం మండలంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

శంకరపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రైతులు వరి ధాన్యం ఆరబోయడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని రైతులు దారుల వెంట వరిధాన్యం ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కొన్ని గ్రామాల్లో రైతులు తమ వరి పంటను రహదారులపై ఆరబెట్టడం గమనించినట్లు తెలిపారు. వాహనదారులు జారిపడడం, ప్రమాదాలు జరగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రహదారులు ప్రజా వినియోగానికి చెందినవని, వాటిపై వస్తువులు, పంట ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే శిక్షార్హులు అవుతారన్నారు. రైతు సోదరులు తమ పంటలను రహదారులపై కాకుండా గ్రామాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

కూరగాయాల సాగు..

● అనుకూలించని పరిస్థితులు.. ఆందోళనలో కూరగాయల రైతులు ● పెరిగిన పెట్టుబడులతో నష్టాలు.. ● రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనుకూలించని వాతావరణ పరిస్థితులతో కూరగాయల రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల సాగు ఒడిదొడుకులతో కూడుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం మండలంలో సాగువిస్తీర్ణం పెరుగుతోంది. చిన్న కమతాలు, నీటి సౌలభ్యం బాగాలేని రైతులు కూరగాయల సాగుకు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు. పెట్టుబడులు పెట్టి ఆదాయం కోసం ఎక్కువ కాలం వేచి ఉండని రైతులు సైతం కూరగాయ పంటలను సాగుచేస్తుంటారు. మండలంలోని రహీంఖాన్‌పేట, రామోజిపేట, తిప్పాపూర్, పొత్తూరు, దాచారం, వల్లంపట్ల తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా కూరగాయల పంటలను సాగుచేస్తుంటారు. మండలంలో గత వానాకాలంలో 75ఎకరాల విస్తీర్ణంలో కూరగాయ పంటలను సాగుచేయగా ఈసారి అధికారుల లెక్కల ప్రకారం 90ఎకరాలు సాగుచేస్తున్నారు. దీనికి తోడు మరికొన్ని గ్రామాల్లోను కూరగాయలను సాగుచేస్తున్నారు. ఎక్కువగా టమాట, మిరప, కాకర, బీరకాయ, పచ్చిమిర్చి, కీరదోస



బీరతోటను పరిశీలిస్తున్న డివిజన్ హార్టికల్చర్ అధికారి



రహీంఖాన్‌పేట గ్రామంలో సాగవుతున్న టమాట

పంటలను సాగుచేయడానికి రైతులు మొగ్గు చూపుతుంటారు. వరుసగా కురిసిన వర్షాలతో పంటలను తీవ్ర నష్టం జరిగింది. దీనికి తోడు సరైన ధరలు లేకలేకపోవడంతో పెట్టుబడులు వచ్చేలా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25కిలోల టమాట బాక్స్ ధర ప్రస్తుతం రూ 400 వరకు రైతులు అమ్ముతున్నారు. టమాటాలను తెంపడానికే ఒక కూలీకి రోజుకు రూ 350 చెల్లిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కంటే చేలకు తెగుళ్ళు ఎక్కువగా వస్తున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం కూరగాయల రైతులకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు.

మార్కెటింగ్ సదుపాయం లేక..

కూరగాయలను పండించిన రైతులకు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలను తెంపిన అనంతరం ఆటలో సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్‌కు తరలించడానికి ఆటో కిరాయి తీసుకొని పోతుంటారు.

కొన్నికొన్ని సందర్భాలలో ఆటో కిరాయిలు, రైతుకు కూలీ కూడా పడటం లేదని పేర్కొంటున్నారు. స్వంత ఆటో ఉన్న రైతులు హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో వారు కొంత లాభపడుతున్నారు. రైతులు తక్కువ పండిన రైతులు పారబోయడానికి ఇష్టపడక వారసంతలలో అమ్ముతూ నష్టాలు మూడ్చుకుంటున్నారు. ఒకప్పుడు లాభసాటిగా ఉన్న కూరగాయల సాగు తరచూ వర్షాలు పడుతుండటం వల్ల కోలుకోలేని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు.

వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది

అవారి బాబు, కూరగాయల రైతు, తిప్పాపూర్



తరచూ వర్షాలు పడటంతో పాటు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు లేకపోవడం వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 2.5 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలను సాగుచేశారు. టమాట, కీరదోస, చిక్కుడు పంటలను వేయడం ద్వారా లాభాలు వస్తాయని ఆశించా. పంటచేతికి అందివచ్చే వరకే రూ 2లక్షల పెట్టుబడులు అయ్యాయి. సరైన ధరలు లేకపోవడంతో పాటు తెగుళ్లు ఎక్కువగా రావడంతో కూరగాయల రైతులు నష్టాలు చవిచూడవలసిన పరిస్థితిలు ఏర్పడ్డాయి.

తెగుళ్లను తొలిదశలో గుర్తిస్తేనే లాభాలు..

వాసాల గోవర్దన్, సిరిసిల్ల డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్



కూరగాయల పంటలను ఆశించే తెగుళ్లను తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే లాభాలు గడించవచ్చు. టమాల, మిరప పంటలకు ఆకుమచ్చ తెగుళ్లు వస్తే మాంకోజెట్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచాకారి చేయాలి. తామర పురుగులు ఆశిస్తే 2మీ.లీ డైమిథోయేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా తెగుళ్ల బాధ తొలగిపోతుంది. రైతులు మారుతున్న పరిస్థితులను నిరంతరం గమనిస్తూ పంటలను తెంపుకోవాలి.

కలెక్టర్ గళంలో 'ఓ చిన్ని పిచ్చుక' పాట



పాట పాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అవనిలో అంతరిక్షంలో మగవారితో సమానం ఆడవారు. ఈనాటి కాలంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. అక్కడక్కడా నిరక్షరాస్యత, పేదరికం, ఆడవారిపై చిన్న చూపు వంటి కారణాలు అమ్మాయిల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. తల్లిదండ్రులకు గర్భ శోకాన్ని మిగులుస్తున్నాయి. ఆడ పిల్లల మనుగడకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ దిశలో పుట్టుక నుంచి ఓ ఇంటి ఇల్లాలయ్యేవరకు ఆడపిల్లల సమస్యలను అర్థం చేసుకున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి మదిలో ఓ ఆలోచన మెరిసింది.

హిందీలో స్వానంద్ కిర్కిరే అనే రచయిత రాసి, పాడిన పాటను తెలుగు లోకి అనువ దిస్తే సమాజంలో అవగా హన పెరుగుతుందని భావించారు. దీంతో ఖాజ్ఞానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నంది శ్రీనివాస్‌ను పిలి పించుకొని తన అంతర్గత భావాన్ని ప్రస్తావించారు. ఆయన స్పందించి పాటను తెలుగులోకి అనువదించగా కలెక్టర్ స్వయంగా పాటను ఆలపించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాటను ఆవిష్కరించారు.

రాజన్న ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా..

● అందరి సలహాలు, సూచనల మేరకు పనులు
● 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక
● దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్



రాజన్న ఆలయ పరిశరాలను పరిశీలిస్తున్న శైలజరామయ్యార్, ఆదిశ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజన్న ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీడీఏ వైస్‌చైర్మన్ కలెక్టర్ ఎం హరిత, ఎస్పీ మహేష్ బీగితే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు ఇతర ప్రముఖుల సలహాలు సూచనలు మేరకు చేపడుతున్నామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రుల సహకారంతో పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. మొదటి దశలో రూ.76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ.35 కోట్లతో అన్న ప్రసాద వితరణశాల, రూ.47 కోట్లతో ప్రధాన రహ దారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలి పారు. భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి విస్తరణ చేస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ పనులపై ప్రతి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి రానున్నారని వెల్లడించారు. ఈ మేరకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించామన్నారు. భక్తులకు రాజన్న ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్, ప్రచారథంలో దర్శనం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీ డీఏ వైస్‌చైర్మన్, కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేష్ బి.గితే ఆలయ ఈవో రమాదేవి ఉన్నారు.

నరసింహుడి హుండీ ఆదాయం 46.84 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా రూ.46,84,046 ఆదాయం లభించింది. గత జూన్ 26 నుంచి అక్టోబరు 15 వరకు గల హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. 27 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 700 గ్రాముల మిశ్రమ వెండి, 26 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం. రాజమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. బుధవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద రేవా ఉమ్మడి జిల్లా ఆధ్వ ర్యంలో రిటైర్డు ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో హకీంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతోందని విమర్శించారు. పెన్షన్ బకాయిలు రాక పెళ్లిళ్ల చేయలేక, ఇల్లు కట్టుకోలేక అనారోగ్యంతో బాధపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరచారి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మామిడాల లక్ష్మీ నారాయణ, కోశాధికారి కనపర్తి దివాకర్, ఐల్నేని నరేందర్‌రావు, వెంకట రమణ, నసీం అహ్మద్, కటకం ప్రభు, కరుణ శ్రీ, రాందాస్, వేణుగోపాల్, విమల, చంద్రమౌళి,చంద్రశేఖర్, దుబ్బయ్య, మదన్‌మోహన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక





నందకిషోర్, వాత్సల్య

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల పీడీలు తెలిపారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలకు చెందిన కట్ల నందకిషోర్ సిరిసిల్లలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ టోర్న మెంటులో ప్రతిభ కన బర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డిలో ఈ నెల 16 నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. గంగాధర మోడల్ స్కూల్‌కు చెందిన వాత్సల్య అండర్ 14 విభాగంలో పెద్దపల్లి జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వీడీ నాగార్జున తెలిపారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అనుష్క రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీ లకు ఎంపికయింది. మంగళవారం కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య డిఫెన్స్ అకాడమిలో ఉమ్మడిజిల్లాల స్థాయి ఎస్జీఎఫ్ అండర్ 19 విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో అనుష్క తన క్రీడాప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం దక్కించుకుంది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని కళాశాల స్పోర్ట్స్, గేమ్స్ ఇన్‌చార్జి సునీల్‌తోపాటు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



అనుష్కను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల : మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పాఠశాలల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో జి.యశశ్విని, జి.హారిక జగిత్యాల జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మండల విద్యాధికారి ఎస్.జయసింహరావు, క్రీడల మండల కన్వీనర్ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.



శ్రీజను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్: మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదవుతున్న శ్రీజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈ సం దర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని శ్రీజను ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. అక్టోబరు 14న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్జీఎఫ్ అండర్ 14 కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీల్లో శ్రీజ అత్యంత ప్రతిభ కనబరిచి సంగా రెడ్డి పటాన్‌చెరువులో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ కుంబాల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఆనంది



జాతీయ స్థాయిలో మూడో స్థానంతో గుర్తింపు

కమాన్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఈనెల 14న జరిగిన 40వ జాతీయ జూనియర్ చాంపియన్ షిప్ అండర్ 16 విభాగంలో నల్లవెల్లి ఆనంది మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ అందుకున్నది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లి శంకర్ భారతిల రెండో కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్నది. అలాగే ఆమె అథ్లెటిక్స్‌లో కొన్నేళ్లుగా తన ప్రతిభతో రాణిస్తూ పలు మెడల్స్ సాధించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో మరో సారి రాణించి మెడల్ సాధించడంపై లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ఆనంది కోచ్ సుబ్బారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సారంగపాణి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌లు బుధవారం ఆనందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆనంది పాల్గొంటున్న టోర్నీల్లో ప్రతిభతో మెడల్స్ సాధించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. అలాగే పలు మెడల్స్ అందుకొని, పుట్టిన ఊరుకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు వాల్ పెయింటింగ్ పోటీలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా మహిళలు, పిల్లలు దివ్యాంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను తెలియజేసే విధంగా బుధవారం వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయ కాంపౌండ్‌పై మత్తు పదార్థాల వినియోగంతో కలిగే సమస్యలను పెయింటింగ్ ద్వారా వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎన్ఎంబీఏ కమిటీ సభ్యులు పెంద్యాల కేశవరెడ్డి, మర్రి రాజేందర్ పోటీలను పర్యవేక్షించారు.

గుంతలమయంగా సిరిసిల్ల-కామారెడ్డి రహదారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు - పట్టించుకోని అధికారులు


రాచర్లగొల్లపల్లి శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత


రాచర్లబొప్పాపూర్ ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధానరహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులకు కనిపించక అదుపు తప్పుతున్నాయి. ప్రయాణికులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రతిరోజు ఆ రహదారి వెంట ప్రయాణిస్తున్నా గుంతలు పూడ్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనాలు గుంతల్లో అదుపు తప్పి ప్రమాదాల పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

వెక్కిరిస్తున్న ఖాళీలు..

(7వ పేజీ తరువాయి)

ఖాళీల నివేదికల ను ప్రభుత్వానికి పంపించారు. మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

30532 మంది లబ్ధిదారులు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 586 అంగన్‌వాడీకేంద్రాల పరిధిలో 30532 మంది పౌష్టికాహారాన్ని పొందు తున్నారు. ప్రస్తుతం జిల్లాలో గర్భిణులు 3234మంది, 2609మంది బాలింతలు ఉన్నారు. వీరితో పాటు 3సంవత్సరాలలోపు పిల్లలు 16848మంది, 3సంవత్సరాల నుంచి6 సంవత్సరాల వరకు 7841మంది ఉన్నారు. వీరికి ఆరోగ్యలక్ష్మి ద్వారా పౌష్టికాహారం, ఆరునెలల నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారులకు బాలామృతంతో పాటు 16కోడి గుడ్లు, హోం రేషన్ అందిస్తున్నారు. చిన్నారులకు ఒక్కపూట సంపూర్ణ భోజనం, గుడ్డు, పాలు కుర్‌కురే వంటి స్నాక్స్‌లు అందిస్తున్నారు. సమర్థవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నప్పటికీ ఎక్కువసంఖ్యలో ఖాళీలు ఉండ డంతో ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు.

అబ్దుల్ కలాం ఆశయ సాధనకు పాటుపడాలి


విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాం ఆశయాల సాధనకు పాటుపడాలని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. కందికట్కూర్ గ్రామంలోని ఎస్సీకాలనీ పాఠశాలలో బుధవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకల సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన కలాం మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందాడన్నారు. ఈసందర్భంగా పూర్వ ఉపాధ్యాయుడు మాన్వాడ శంకర్ అందించిన డిక్షనరీలను, పెన్నులను ఉత్తమ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

భీం యువసేన అధ్యక్షుడిగా కిషన్

ఇల్లంతకుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో భీం యువసేన అధ్యక్షుడుగా కాసుపాక కిషన్ ఎన్నికయ్యాడు. ఉపాధ్యక్షుడుగా కాసుపాక నవీన్, ప్రధాన కార్యదర్శిగా కాసుపాక శంకర్, సహాయకార్యదర్శిగా కాసుపాక బాబు, కోశాధికారిగా కత్తెరపాక అనీల్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు ఘనంగా సత్కరించారు.

అనంతపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం


బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

చందుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం అనంతపల్లికి బుధవారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వేములవాడకు వెళ్లాలంటే 3కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి బస్సు ఎక్కేదన్నారు. గత ప్రభుత్వ పాలకులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. పది రోజుల క్రితం గ్రామస్థులు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. ఆర్టీసీ పీఆర్వో శ్రీనివాస్, చందుర్తి సింగిల్‌విండో మాజీ వైస్‌చైర్మన్ చింతపంటి రామస్వామి, తోట్ల శ్రీనివాస్, బక్కశెట్టి రాజు, తొట్ల మల్లేశం, చిన్న వెంకటేశం, కనకరాజు, రాజయ్య, మహేష్, అనీల్ మహిళలు పాల్గొన్నారు.

దేవుడినే మోసగించిన బీఆర్‌ఎస్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రజలకు పడ్డ బాకీలను చెల్లించకపోవడంతో గత ఎన్నికల్లో తిరస్కరించారని, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి యేటా రూ.100 కోట్లు విడుదల చేస్తామని దేవుడినే మోసగించిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. దళితుడిని సీఎం చేస్తానని మాట తప్పిందని ఆరోపించారు. అన్ని వర్గాలను వంచించి అధికారం కోల్పోగానే బాకీ కార్డుల పేరిట కొత్త డ్రామాకు తెరలేపిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేసిందని, మిగిలిన రెండు గ్యారెంటీలను నెరవేర్చాడని సిద్ధంగా ఉందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారు ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు అందించాల్సిందీ కాంగ్రెస్ బాకీ కార్డు కాదని, బీఆర్‌ఎస్ అవినీతి కార్డులని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎన్ని నాటకాలకు తెరదీసిన ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి గుణపాఠం చెబుతారని నర్సయ్య అన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు గౌస్, బాబు, వెంకట్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, కిషన్, శంకర్, దేవేందర్, లచ్చిరెడ్డి, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు..


సదస్సులో మాట్లాడుతున్న ఏవో జయ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ శ్రమ.. అధిక లాభాలు సాధించే ఆయిల్ పామ్ సాగుపై అన్నదాతలు దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జయ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి జయ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రాయితీ అందిస్తోందన్నారు. పంట దిగుబడిని కొనుగోలు చేసి ధరను కల్పిస్తోందన్నారు. ప్రియునిక్ సంస్థ డీజీఎం మల్లేశ్వర్‌రావు ఆయిల్‌సాగు విధానం, అంతర పంటలు, తదితర అంశాలను వివరించారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులు రాములునాయక్, నర్సింగంలు తన అనుభవాలను వెల్లడించారు. పంట కొనుగోలుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, తహసీల్దార్ ముస్తాక్‌పాషా, ఎంపీడీవో బీరయ్య, ఏఈవో ఫజిల్, డీహెచ్ఎస్‌వో లత, సంస్థ ప్రతినిధులు రోహిత్, గోవర్ధన్, ఏపీఎం సుదర్శన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

చందుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని చందుర్తి మండల పశు వైద్యాధికారులు పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శిబిరం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు ప్రతి గ్రామంలో జాతీయ వ్యాధుల నివారణ కార్యక్రమం కింద పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏ మౌనిక వైద్య సిబ్బంది బాలకృష్ణ, అజయ్, పాడి రైతులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గ్రామంలో బుధవారం జరిగిన పశువైద్య శిబిరంలో 261 ఆవులకు, 81 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా వేసే టీకాలను రైతులందరు తమ పశువులకు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు పూర్ణచంద్రిక, ఇందిర, వీఏ లచ్చయ్య, గోపాలమిత్రలు రాజయ్య, రంజాన్, రమేష్, ఏసురెడ్డి, వంశీలతో పాటు రైతులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఎం హరిత అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో 2025-26 పత్తి కొనుగోలుపై వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, పోలీస్, అగ్నిమాపక శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ హరిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిత మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో 5 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని అన్నారు. గత ఏడాది 2,46,000 క్వింటాళ్ల పత్తి కొనగోలు చేశారని అన్నారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని అందులో వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు ఉంటాయన్నారు. పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలకు రూ. 7689 నుంచి 8110 మద్దతు ధర ఉంటుందన్నారు. రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు ధరను పొందాలని అన్నారు. కపాస్ కిసాన్‌లో రైతులు స్లాట్ బుక్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పత్తి మద్దతు ధరల వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నరేష్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మన్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల ఏర్పాటుకు పోటాపోటీ

- ముగిసిన దరఖాస్తుల గడువు - ఎన్‌వోసీ కోసం తిరుగుతున్న వ్యాపారులు


అగ్రహారంలోని హోల్‌సెల్ టపాసుల దుకాణం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళికి టపాసుల దుకాణాలు సిద్ధమవుతున్నాయి. ఈనెల 1న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. సిరిసిల్ల సబ్‌డివిజన్ పరిధిలోని సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని వేములవాడ, చందుర్తి, రుద్రంగి, బోయిన్‌పల్లి, కోనరావుపేట మండలాల వ్యాపారులు ఆయా ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తులు చేశారు. దరఖాస్తులను పరిశీలించి దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తారు. ఇందుకు 15రోజులుగా వ్యాపారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 100కు పైగా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు సమర్పించారు. సిరిసిల్లలోని మానేరువాగు బతుకమ్మ తెప్పవద్ద, వేములవాడలోని బైపాస్ రహదారి పక్కనగల విశాలమైన ప్రదేశంలో తాత్కాలిక టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంవద్ద హోల్‌సెల్ టపాసుల దుకాణం ఉంది. వేములవాడలోనూ హోల్‌సెల్ దుకాణం ఏర్పాటుకు వ్యాపారులు ప్రయత్నించినా నిబంధనలు సక్రమంగాలేవని అనుమతివ్వలేదు.

అనుమతి కోసం ఎదురుచూపులు

టపాసుల దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్న వ్యాపారులు అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. ముందుగా రెవెన్యూ శాఖ నుంచి అనుమతి ఇచ్చాక మిగతా శాఖలు ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రధానంగా ఫైర్, పోలీస్, మున్సిపల్ శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఈనెల 20న దీపావళి పర్వదినం కావడంతో టపాసుల దుకాణాలు నెలకొల్పడానికి వ్యాపారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అన్నిశాఖల ఎన్‌వోసీ లభించగానే దుకాణాలు ఏర్పాటుచేసుకుంటారు. ఈనెల 18నుంచి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట ప్రాంతాల్లో టపాసుల విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

వందకు పైగా దరఖాస్తులు..

జిల్లాలో 100కు పైగా టపాసుల దుకాణాల అనుమతి కోసం వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సిరిసిల్లలో 48, వేములవాడలో 35, ఎల్లారెడ్డిపేటలో 8, ముస్తాబాద్ 1, ఇల్లంతకుంటలో 1 గంభీరావుపేటలో 1, తంగళ్లపల్లిలో 2 చొప్పున టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతి కోసం దరకాస్తు చేశారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో టపాసుల దుకాణాల ఏర్పాటుకు పోటీ నెలకొంది. పోటీదృష్ట్యా వేములవాడ, సిరిసిల్లలో డ్రా పద్ధతిన నంబర్లు వేసి వరుస క్రమంలో దుకాణాలు కేటాయించే అవకాశం ఉంది.

నిబంధనలు గాలికి..

జిల్లాలో టపాసుల దుకాణాల ఏర్పాటులో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నివాసాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో షెడ్లు వేసి టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలి. ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలి. టపాసుల దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ, పోలీసు, ఫైర్, మున్సిపల్ శాఖల క్లియరెన్స్ తప్పనిసరి పొందాల్సి ఉంటుంది. ఒక్కో టపాసుల దుకాణం ఏర్పాటు చేయడానికి రెవెన్యూకు రూ.2000, పోలీస్‌శాఖకు రూ.500, ఫైర్‌కు రూ.500, మున్సిపల్‌శాఖకు రూ.3500 చాలన్ రూపంలో ఫీజు చెల్లించి దరకాస్తు చేసుకుంటే అన్ని పరిశీలించి అనుమతి పత్రం జారీచేస్తారు.

పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరిత

కోనరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం పల్లిమక్తలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ఎం.హరితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటుగా పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీపై 200 యూనిట్ల గేదెలను రైతులకు ఇటీవల పంపిణీ చేశామని గుర్తు చేశారు. పశు సంపదను కాపాడితే రైతుకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న రైతులకు పశువులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. మధ్య మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు పాడి పరిశ్రమ కింద ఉపాధి కల్పించేందుకు ఇటీవల ఆ శాఖ మంత్రిని కలిశామని వివరించారు. భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. సాగుకు అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తి చేసి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలకు సాగు నీరు అందించి పంటలను కాపాడామని గుర్తు చేశారు. ఈ ఏడాది రిజర్వాయర్ లో రెండు టీఎంసీల నీటిని నిలువ ఉంచామని, వచ్చే ఏడాది మూడు టీఎంసీల నీటిని నిలువ పెట్టనున్నామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాలువలు పూర్తి చేసి కోనరావుపేట మండలంలోని దాదాపు 10 గ్రామాలకు సాగునీటిని అందించామని గుర్తు చేశారు. మల్కపేట కు రూ. 12 కోట్ల బిల్లులు చెల్లించామని తెలిపారు. రుద్రంగి కలికోట సూరమ్మ చెరువుకు రూ.75 కోట్లు మంజూరు చేయగా, పనులు వేగంగా ముందుకు వెళ్తున్నాయని విప్ వెల్లడించారు. నాగారానికి రోడ్డు వేయించామని, పల్లిమక్తలో రూ. కోటి 50 లక్షలతో రోడ్డు వేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ హరిత

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఎం హరిత పేర్కొన్నారు. కోనరావుపేట మండలంలోని పల్లిమక్త గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో కలెక్టర్ హరిత పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంతో పాటుగా రైతులు అనుబంధంగా పశువులను పెంచుకోవడంతో ఆర్థికంగా మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వపరంగా అర్హులైన రైతులకు పశువులు, కోళ్లు ఇతర జీవాలను ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం టీకాలు పంపిణీ చేస్తుందని వెల్లడించారు. పశువుల పెంపకందారులు తమ గ్రామాల్లో పశువైద్యాధికారులు నిర్వహించే శిబిరాలకు జీవాలను తీసుకెళ్లి టీకాలు వేయించాలని కలెక్టర్ హరిత సూచించారు. పశువులు ఉండే పరిసరాలు నిత్యం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని దీంతో అవి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. పశువుల పెంపకం దారులు ఏటా అందజేసే టీకాలను జీవాలకు వేయించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య , తహసీల్దార్, ఎంపీడీవో, కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, నాయకులు కచ్చకాయల బాల్‌రెడ్డి, బొడ్డు రమేష్, నీరటి సంజీవ్, ఉప్పుల గంగయ్య, సుంకరి మహేష్, సిద్ధరేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


జిల్లా అధ్యక్ష స్థానానికి దరఖాస్తు చేస్తున్న సంఘ స్వామి యాదవ్

వేములవాడ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నికలు పారదర్శకంగా ఉంటున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణం లోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో నియోజకవర్గ బ్లాక్‌స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఏఐ సీసీఅబ్జర్వర్ మన్నె శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భగా నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయుకులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి జిల్లా అధ్యక్ష ఎన్నికల అభిప్రాయ సేకరణను తీసుకున్నారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా ఉంటుందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ కేసీ వేణుగోపాల్ ఏఐసీసీ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు జిల్లా అధ్యక్ష ఎన్నిక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష రేసులో సంఘు స్వామియాదవ్

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పీఠం కోసం పోటీలో బీసీ వర్గానికి చెందిన తాను బరిలో ఉన్నట్లు సంఘ స్వామి యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తిగా, క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న నేతగా తనకు ప్రత్యేక గుర్తింపుందని ఆయన తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అత్యంత సన్నిహితుడినైన తనకు తప్పకుండా జిల్లా అధ్యక్ష పదవి వరిస్తుందని స్థానిక నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కంటతడిని రాజకీయం చేస్తున్న మంత్రులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌ను గుర్తుచేసుకుంటూ కంటతడి పెట్టుకున్న ఆయన సతీమణి మాగంటి సునీతపై మంత్రులు రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సునీతకు వస్తున్న ఆధరణను తట్టుకోలేక మంత్రులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఆడబిడ్డ అని కూడా చూడకుండ అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రులు వెంటనే సునీతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మట్టె శ్రీనివాస్, ఎస్‌కే అఫ్రోజ్, కోడం వెంకటేశం, సిరిమల్లె హరీష్, సంపత్, నరేష్, రాము పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నించిన వారిని శిక్షించాలి

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసేందుకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన ఆందోళనలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బుధవారం స్థానిక నాయకులతో కలిసి లక్ష్మణ్ మాట్లాడారు. సీజేఐ బీఆర్ గవాయ్ దాడిని దళిత సమాజంపై దాడిగా పరిగణించాలని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థకు చీకటి రోజని అన్నారు. రాజ్యాంగం పట్ల గౌరవం లేని వ్యక్తి దాడికి యత్నించారని అన్నారు. సదరు వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు భగవంతం, రాజం, దేవరాజు, రాజయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు


సామూహిక సీమంతంలో పాల్గొన్న మహిళలు

ఇల్లంతకుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు అధిక పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీవో ఉమారాణి సూచించారు. పోషణ మాసం సందర్భంగా మండలకేంద్రంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలు, పండ్లు,చిరుదాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని, ఆయిల్, షుగర్ వాడకాలను తగ్గించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కొనసాగే పూర్వప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శశికళ, వైద్యాధికారి జీవనజ్యోతి, సూపర్‌వైజర్లు సూర్యకళ, చంద్రకళలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తులు

ఇల్లంతకుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటీలు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే మన్నె శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నందున అవకాశం కల్పించాలని వినయ్ కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మచ్చ రాజేశం, ఫిషరీస్ చైర్మన్ జెట్టి మల్లేశం, సోషల్‌మీడియా అధ్యక్షుడు కాసుపాక రమేష్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు జెట్టి నగేష్ తదితరులు ఉన్నారు.